



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
శుక్రవారం 25 జూలై 2024 8 పేజీలు

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతోపాటు కల్తీ సరకుల విక్రయాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కల్తీ నూనె విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. వీటి వల్ల మోసపోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.. ప్రతీ మనిషి ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు తినే ఆహారంలో ఎక్కువగా వినియోగించేది వంట నూనెలను మాత్రమే.. అలాంటి వంట నూనెలను కొంతమంది మాఫియాగా ఏర్పడి కల్తీ చేస్తూ దానిని యథేచ్ఛగా ప్రజలకు విక్రయిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.. ఈ వ్యాపారం అంతా కూడా పల్నాడు, గుంటూరు జిల్లాల కేంద్రంగా సాగుతూ రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఈ నూనెలను సరఫరా చేస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా చేసుకుంటున్నారు.. అయితే వీరి వ్యాపారానికి ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు వంత పాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.....

# కల్తీ రాయుళ్లు



## యథేచ్ఛగా కల్తీ నూనెల వ్యాపారం.!

- అయోమయంలో ప్రజల పరిస్థితి..!
- ఫుడ్ క్వాలిటీ విభాగం నిర్వీర్యం
- కల్తీ వస్తువులతో రోగాల బారిన పడుతున్న జనం
- అడ్డు అదుపు లేకుండా విస్తరిస్తున్న కల్తీ వ్యాపార ఘనులు

*గుంటూరు/పల్నాడు జిల్లా*
*నేటి దినపత్రిక సూర్య బ్యూరో*

ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రంగా కల్తీ వంట నూనెల తయారీ జోరుగా సాగుతుంది. వివిధ బ్రాండ్ల నూనెలను సైతం కల్తీ చేస్తూ ఇక్కడ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వంట నూనెలను కల్తీ చేస్తూ వాటికి వివిధ రకాల బ్రాండ్ల పేర్లతో కూడిన లేబుళ్లను అతికిస్తూ జోరుగా

మిగతా 3లో

## పేదరిక నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి



### జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పిలుపు
### నారా కోడూరులో పి 4 గ్రామ సభ నిర్వహణ

**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** సమాజంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం, దాతలతో పాటు ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించారని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు.గురువారం చేబ్రోలు మండలంలోని నారా కోడూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా తో కలసి ప్రభుత్వం, దాతలు, ప్రజలు

మిగతా 3లో

## ఈ పాపం..ఎవరిది.?

### అప్పుడే పుట్టిన పసికందు చెత్తకుప్పలో...
### నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలో దారుణం



**మంగళగిరి, మేజర్ న్యూస్:** తల్లి తన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసిందా? లేక ఆడపిల్ల కావడమే శాపమైందో తెలియదు కానీ... అప్పుడే పుట్టిన ఆ పసికందు కు చెత్తకుప్ప ఆవాసమైంది. తల్లి ఒడిలో వెచ్చగా సేదదీరాల్సిన ఆ చిట్టి తల్లి... ఈగలు, దోమల మధ్య నలిగిపోయింది. గుక్క పట్టి ఏడుస్తుంటే అటుగా వెళుతున్న వారు గుర్తించి మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎట్టకేలకు ప్రాణం దక్కింది. ఈ అమానవీయ ఘటన గుంటూరు జిల్లా మంగళగిరి తాడేపల్లి - నగరపాలక సంస్థ పరిధి నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలో గురువారం రాత్రి వెలుగు చూసింది. తొమ్మిది నెలలు మోసి

మిగతా 3లో

## సైబర్ నేరాలు అరికట్టడంతో నూతన సాంకేతికతను
# అందుబాటులోకి తెచ్చిన ఏపీ టీఎస్

- సైబర్ మోసాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు
- రాష్ట్రంలో టెక్నాలజీ సర్వీసులను ప్రజలకు మరింత చేరువ చేస్తాం
- ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ వెల్లడి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను రక్షించేందుకు ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. గురువారం విజయవాడ ఆర్ అండ్ బీ బిల్డింగ్ లోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 24 గంటలూ ఐటీ ఇన్ ఫ్రాస్టక్చర్ ను పర్యవేక్షిస్తూ ముందస్తు హెచ్చరికలు అందిస్తూ ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) కీలక భూమి పోషిస్తుందన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. దీనివల్ల సైబర్ నేరాలకు నేరగాళ్లు ఏ విధంగా నేరాలకు పాల్పడుతున్నారు అనే విషయాలతోపాటు మోసపోయిన అనంతరం ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలపై అవగాహన సదస్సుల్లో తెలియజేస్తామన్నారు. ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని సాంకేతికత ద్వారా వీటిని అరికట్ట వలసిన అవసరం ఉందన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంపై

మిగతా 3లో

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. టిప్పర్లబజార్‌కు చెందిన మునగాల విజయదుర్గకు రూ. 50,250/- శ్రీలక్ష్మినరసింహాస్వామికాలనీకి చెందిన షేక్ బేగంకు రూ. 55 వేలు, కూరగాయల మార్కెట్‌కు ప్రాంతానికి చెందిన అకినపల్లి లవ్‌కుమర్‌కు రూ. 22,700 విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం ఉండాలని ఆకాంక్షించారు. సీఎం సహాయనిది చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు అధ్యక్షులు తేలు వెంకటేశ్వరరావు, 26వ వార్డు అధ్యక్షులు గంజి లక్ష్మయ్య, 27వ వార్డు అధ్యక్షులు పందెటి మణికంఠ నాయకులు జగ్గారపు రాము, ఉద్దంటి గాంధి, పొట్లబత్తుని లక్ష్మణ్ రావు, షేక్ షౌకత్, నక్కా బాల కోటేశ్వరరావు, పాలడుగు ఏసు, అందె వెంకటేశ్వరరావు, గుడిపూడి శివకృష్ణ, ఊట్ల శివనారాయణ, షేక్ సుభాని, కుర్నేళ్ల పూర్ణ, దోనేపూడి భాస్కర్, ఆకురాత్రి సత్యనారాయణ, బిట్రా నాగేశ్వరరావు, కాట్రు రవికుమార్, గాజుల వెంకటరమణరావు, రాయపాటి విజయ్ కుమార్, చింతక్రింది వెంకటేశ్వరరావు, పాగోలు జయప్రకాష్, నందూరి పండిత్ మణికంఠ, షేక్ అన్వార్, రామరావు తదితరులు పాల్గొన్నారు.

## బోరింగ్ పంపుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు గురువారం పట్టణంలో ఐదు బోరింగ్ పంపుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిలకలూరిపేట అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద రావు స్టేడియం సమీపంలో ఒక బోరింగ్ పంపు, చంద్రబాబు నాయుడు కాలనీలో రెండు, ఎస్ఆర్‌కేటీ కాలనీలో రెండు బోరింగ్ పంపుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఈసీ మెంబర్ ముత్తినేని వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించే ఈ చొరవ స్థానికుల నుంచి మంచి ఆదరణ పొందింది.

## ఏరియా వైద్యశాల, నరసరావుపేట, పల్నాడు జిల్లా వేలం నోటీసు

ఏరియా వైద్యశాల, లింగంగుంట్ల వైద్యశాల ప్రాంగణములో అడ్డుగా ఉన్న 17 చెట్లను తొలగించుటకు వేలం పాట నిర్వహించడము జరుగును. వేలం పాట నందు పాల్గొనుటకు రూ. 5000/ (రూపాయలు ఐదు వేలు మాత్రమే) నగదు లేదా హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ ఏరియా హాస్పిటల్, నరసరావుపేట వారి పేరున డి డి గాని బ్యాంకు చెక్కు తీసుకొని వైద్యశాల కార్యాలయమునందు ఇచ్చి రసీదు పొందివేలం పాట నందు పాల్గొనగలరు.

ఈ యొక్కవేలం పాట నందు పాల్గొనుటకు, నగదు డి డి లేదా బ్యాంకర్స్ చెక్కులను తేదీ: 25.07.2025 నుండి 28.07.2025 ఉదయము పదకొండు గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. వేలం పాట నగదు, డిడి లేదా బ్యాంకు చెక్కులను సమర్పించిన వారి సమక్షమున 28.07 2025 సాయంత్రము మూడు గంటలకు మెడికల్ సూపరింటెండెంట్ వారి కార్యాలయమునందు వేలంపాట నిర్వహించబడును. వేలం పాటను వాయిదా వేయుట లేదా పూర్తిగా రద్దు చేయు అధికారము మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్, నరసరావుపేట వారికీ కలదు.

వేలం పాటకు సంబంధించిన పూర్తి వివరములను వైద్యశాల కార్యాలయమునందు కార్యాలయ పనివేళలనందు తెలుసుకొనగలరు.

MEDICAL SUPERINTENDENT SECONDARY HEALTH AREA HOSPITALNARASARAOPET, PALNADU DT

# జాషువా రచనలు ముందు తరాలకు అందించాలి

**తెనాలి, మేజర్ న్యూస్ :** మహాకవి గుర్రం జాషువా 54వ వర్ధంతిని గుర్రం జాషువా విజ్ఞాన సమితి తెనాలి వారు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల గుర్రం జాషువా విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన జరిగిన జాషువా వర్ధంతి వేడుకల్లో పలువురు ప్రముఖులు జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి, యునెస్కో అవార్డు గ్రహీత పినపాటి రవికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిజిఎం కొండముది రమేష్ బాబు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అత్తోట నాగవేణిలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిజిఎం కొండమది సుధీర్ బాబు మాట్లాడుతూ జాషువా రచనలు సమాజాన్ని మేల్కొల్పాయని, సమాజంలోని అసమానతలు తొలగింపునకు ఆయన రచనల ద్వారా ఎనలేని కృషి చేశారని అన్నారు. జాషువా సాహిత్యాన్ని ముందు తరానికి అందించడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అత్తోట నాగవేణి మాట్లాడుతూ జాషువా సాహిత్యం ఆనాటి కాలంలో సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చిందని తెలిపారు. అంటరానితనాన్ని పారద్రోలటంలో కీలక భూమిక పోషించిందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, యునెస్కో అవార్డు గ్రహీత పినపాటి రవికుమార్ మాట్లాడుతూ గుర్రం జాషువా సాహిత్యం సమాజ హితం కోసమే సాగిందని వెల్లడించారు. జాషువా కారణజన్ముడని కొనియాడారు. ఆయనకు లభించిన పద్మభూషణ్ ఆయన చేసిన కవిత సంపుటికి తగినది కాదని, ఆయన్ను మరింత మెరుగైన పురస్కారాలతో సత్కరించుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. దళిత వర్గాల్లో పుట్టిన జాషువా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం రచన సాహిత్యాన్ని



కొనసాగించి విశ్వక్ కవిగా చాతిగాంచిన తీరు గొప్పది అన్నారు. కవిత లోకంలో ఆయన ఒక ధ్రువతార అంటూ కొనియాడారు. ఆయనకు భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆ కార్యక్రమంలో న్యాయవాదులు ఇందుపల్లి రాజారామ్, ఆరుమళ్ళ శ్రీనివాసరావు, బొబ్బిళ్ళపాటి ప్రసాదరావు, పట్టణ రంగస్థలం కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు, సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, వేజండ్ల రత్నం, కొండముది రమేష్, అబ్దుల్ హకీం జానీ, చోడవరపు భాస్కరరావు, ఆర్ అండ్ బి రాజు, వేజెండ్ల శ్రీనివాసరావు, రావూరి ప్రేమ్ కుమార్, జయరావు, అత్తోట శ్యామ్, సిద్ధల కమలాకర్ రావు, కనపర్తి డేవిడ్, విన్సెంట్ కుమార్, శ్రీనివాసరావు, పి అశోక్ కుమార్, రావూరి బాలరాజ్, ఈఊరు ప్రేమ్ కుమార్, గుర్రం జాషువా విజ్ఞాన సమితి సభ్యులు, జాషువా అభిమానులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలి

**– రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేసిన చట్టంలో బీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే అమలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో పలువురు బీసీ నాయకులు-మహిళా నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జాతీయస్థాయిలో జనగణనలో కులగణన జరిగి, నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు జరపాల్సి ఉన్నదన్నారు. అనాదిగా భారతీయ ఆధిపత్య పెత్తందారీ మనువాద సమాజంలో, ఓబీసీలు మొత్తంగా సామాజిక అణచివేతకు, ఆర్థిక దోపిడీకి గురై అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కావున మహిళా రిజర్వేషన్లను దేశంలోని అన్ని వర్గాల మహిళలతో కలిపి 33 శాతం ఇవ్వడం వల్ల బలహీన వర్గాలకు చెందిన ఓబీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. విద్యా పరంగా, సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఓబిసి మహిళలు అగ్రకుల మహిళలతో పోటీపడి గెలవడం అసాధ్యమన్నారు. పార్లమెంట్ చట్టం చేసిన విధంగా ఉన్నది ఉన్నట్లు అమలు చేస్తే నూరుశాతం అగ్రకుల మహిళలతోనే పార్లమెంటు నింపబడుతుందన్నారు. ఓబీసీ మహిళలు ఒక్కరు కూడా నేటి ధన బలంతో సాగే ఆదిపత్య పెత్తందారి వర్గ రాజకీయాలలో పాల్గొని, అగ్రకుల మహిళలను ఓడించి, చట్టసభలలో అడుగుపెట్టగలిగే పరిస్థితి లేదన్నారు. అన్ని విధాల బలమైన ఓసి మహిళలతో, బలహీన వర్గాల మహిళలు పోటీ పడలేరని పునరుద్ఘాటించారు. అందుకే ఓబిసి మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వెనుకబడిన తరగతుల మహిళలు ఉద్యమించాల్సి వచ్చిందన్నారు. ఈనెల 28 న విజయవాడలో జరిగే ఓబీసీ మహిళల రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుంటుపల్లి ఉమామహేశ్వర రావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు చెప్పాడ చందు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర యువజన నాయకులు కిరణ్, పూర్ణ, శివాజీ, వేముల కృష్ణ, రామచంద్ర పాల్గొన్నారు.

# పి-4 కార్యక్రమం అద్భుత ఫలితాలను ఇస్తుంది

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పి-4 కార్యక్రమం అద్భుత ఫలితాలను ఇస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు గురువారం నరసరావుపేట స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జులై 24, 2025 ఏర్పాటు చేసిన పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) కార్యక్రమంలో శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమం ప్రతిష్టాత్మకమైనదని ఇది స్థానిక అభివృద్ధికి ఊతమిచ్చే పథకమని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ పి-4 కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రభుత్వం ప్రైవేటు సంస్థల సహకారంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామని" తెలిపారు. ఈ కార్యక్రమం కింద బంగారు కుటుంబం పథకం అద్భుత ఫలితాలను సాధిస్తుందని, సమాజంలో ఆర్థిక స్థిరత్వం సామాజిక సమానత్వం సాధించడానికి ఈ పథకం దోహదపడుతుందని ఆయన ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల గురించి వివరిస్తూ ఈ హామీలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు ముఖ్యంగా మహిళా శక్తి గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ మహిళల సాధికారత ద్వారా సమాజం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందని ఈ దిశగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు సచివాలయాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ సచివాలయ సిబ్బంది తమ కార్యాలయాలను శుభ్రంగా వ్యవస్థీకృతంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు పరిశుభ్రమైన వాతావరణం ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది అని ఆయన అన్నారు జనాభా పెరుగుదలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ, డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, "రాష్ట్ర జనాభా వృద్ధికి అనుగుణంగా ప్రతి కుటుంబం ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండాలని" ప్రజలను కోరారు. ఈ విధానం




దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక, సామాజిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పి-4 కార్యక్రమం ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలో పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కానున్నాయి....

# ఆగస్టు 2, 3న విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్నాతకోత్సవాలు

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్,
- నలుగురికి గౌరవ డాక్టరేట్లు ప్రధానం
- 3200 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** ఆగస్టు 2వ తేదీ శనివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం, ఆగస్టు 3వ తేదీ ఆదివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ ,పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాలను కలిపి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఆగస్టు 2న జరిగే 13వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ , గౌరవ అతిథులుగా హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, హైదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 3న జరిగే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రామ్ కుమార్ కాకాని, అతిథిగా విజయవాడలోని ఆర్‌ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధా రాణి హాజరవుతున్నారని తెలియజేసారు.

**3200 మందికి పైగా డిగ్రీలు అందజేత**

ఆగస్టు 2న జరిగే 13వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 2000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ చాన్స్‌లర్ తెలిపారు. 13వ స్నాతకోత్సవం సందర్భంగా 26 మంది విద్యార్థులకు బ్రాంచ్‌ల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి చైర్మన్ బంగారు పతకం, బెస్ట్ ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, సోషల్ ఎంగేజ్‌మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ ఉంటాయన్నారు. వివిధ విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా ప్రత్యేక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 3న జరిగే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 1200 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ చాన్స్‌లర్ తెలిపారు.

**నలుగురికి గౌరవ డాక్టరేట్లు ..** 13 స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వివిధ రంగాలలో వారు అందించిన సేవలు, కృషికి గాను ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లను ప్రధానం చేయనుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, హైదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారిలు గౌరవ డాక్టరేట్‌లు అందుకోనున్నారని వెల్లడించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఆర్‌ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధా రాణికు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు. ఆగస్టు 2, 3న జరిగే స్నాతకోత్సవ కార్యక్రమాల్లో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్, చాన్స్‌లర్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, స్నాతకోత్సవ కన్వీనర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- గత ప్రభుత్వంలో రోడ్లన్నీ అధ్వానం
- శారదాకాలనీ రూ.26 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** రాష్ట్రంలో విజనరీ పాలన సాగుతోందని, ఇది ఏపీ భవిష్యత్తును అద్భుతంగా మార్చబోతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని శారదాకాలనీ 16వ లైను నుంచి 21వ లైను మెయిన్ రోడ్డు నిర్మాణానికి మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రూ.26 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో శారదాకాలనీలో అడుగుపెట్టాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. రోడ్లు అధ్వానంగా మారి వాహనదారులు రావాలంటే చుక్కలు కనిపించేవని తెలిపారు. అలాంటి పరిస్థితుల నుంచి సుందరమైన రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే వందల కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. వర్షాలు వస్తే ఇళ్ళు నీటి మునిగిపోయేవని, ఇప్పుడు డ్రైయిన్ల నిర్మాణం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపబోతున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని, మద్దిరాల మ్యాని, క్లస్టర్ ఇంచార్జ్ మహంకాళి నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, కో క్లస్టర్ ఇంచార్జ్, వంగర ఏడుకొండలు, డివిజన్ అధ్యక్షులు బాజీ, గిరి, రమణ, కేసాని ప్రసాద్, సుభాని, దేశ బోయిన శ్రీనివాస్ యాదవ్, రావూరి మోహన్ కృష్ణ, కోట గోపాల్, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గుడిమెట్ల దయారత్నం, రాచకొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ రాయుళ్లు

మొదటిపేజీ తరువాయి

వ్యాపారం చేస్తున్నారు. చుట్టుపక్కల జిల్లాలతో పాటు రాష్ట్రాలకు యదేచ్చగా సరఫరా చేస్తున్నారు. అయినా ఈ దందా గురించి ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఈ వ్యాపారం గురించి తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదనేది బహిరంగ రహస్యం.

**కల్తీ నూనెలతో అనారోగ్యాల పాలు..** కల్తీ వంట నూనెలను తినడంతో ప్రజలు వివిధ రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ విషయం వైద్యులు ప్రజలకు చెబుతున్నప్పటికీ అమాయక ప్రజలకు ఒరిజినల్ నూనెలు దొరకడమే గగనం అయిపోయింది. కల్తీ నూనెలకు వివిధ రకాల బ్రాండ్ల లేబుళ్లను అతికించి ప్రజలకు విక్రయిస్తుండడంతో ఏది అసలు, ఏది నకిలీయో తెలియక వాటిని కొనుగోలు చేస్తూ ప్రజలు తిని అనారోగ్యాలకు గురవుతున్నారు.

**వచ్చేది ఎడిబుల్ ఆయిల్.. తయారయ్యేది రిఫైండ్ వంట నూనెలు..** ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక వంట నూనెల తయారీ పరిశ్రమకు వచ్చేది ఎడిబుల్ ఆయిల్ ట్యాంకర్లు. ఈ ఎడిబుల్ ఆయిల్ ను ఆ పరిశ్రమలో దిగుమతి చేసుకొని దానిలో వివిధ రకాల కెమికల్స్ వాడుతూ దానిని కల్తీ చేస్తూ సన్ఫవర్, పల్లి, రైస్ బ్రాన్ వంట నూనెలు అంటూ తయారు చేస్తున్నారు. వీటిని వివిధ రకాల బ్రాండ్ల పేర్ల స్టిక్కర్లను అతికిస్తూ యదేచ్చగా రావాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**అధికారుల తనిఖీలు ఎక్కడ..?...**

ప్రజలు తినే ఆహారాన్ని కల్తీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో కల్తీ మాఫియా కు అడ్డుకట్ట వేసే వారే లేకుండా పోయారు.

## సైబర్ నేరాలు అరికట్టడంతో నూతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిన ఏపీ టీఎస్

మొదటిపేజీ తరువాయి

ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన విద్యార్థులు మరియు ఐటీ నిపుణులకు శిక్షణ కోసం రాష్ట్రస్థాయి సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ ను నిర్వహించడం జరిగిందని, అందులో ఎంపికైన వారికి ఆరు నెలలపాటు సైబర్ సెక్యూరిటీ లో శిక్షణ ఇచ్చామని, శిక్షణా కాలంలో నెలకు రూ. 10 వేల స్టయ్ ఫండ్ అందించామన్నారు. అనంతరం ఇంటర్న్ షిప్ పూర్తిచేసిన 30 మందికి సర్టిఫికెట్స్ ను అందించామన్నారు. సైబర్ సెక్యూరిటీ లో నిపుణులుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దేశ, విదేశాల్లో అనేక ఐటీ కంపెనీల్లో అవకాశాలున్నాయన్నారుసైబర్ నేరగాళ్ల డేటాను దొంగిలించటం, బెట్టింగ్ యాప్ ల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించి దోచుకుంటున్నారని అంతేకాకుండా వ్యాపార సంస్థల వ్యాపారాలపై దాడులు చేసి వారిని ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నారన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖులతో పలు మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు సైబర్ మోసాలపై చర్యలకు ఆదేశించారన్నారు. 2013 లో సైబర్ సెక్యూరిటీపై కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని ఆ చట్టానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా 2017 లో సైబర్ సెక్యూరిటీ పాలసీని తీసుకొచ్చిందని దానికి ఏపీటీఎస్ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 లో ఏపీ సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ ను ఏర్పాటు చేశారన్నారు. ఈ సంస్థ ప్రభుత్వ విభాగాలకు సైబర్ సెక్యూరిటీ ముప్పు రాకుండా నిరంతరం పర్యవేక్షించే ప్రత్యేక కేంద్రమన్నారు. ఏపీటీఎస్ తన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సేవలను ప్రభుత్వ సెక్టార్ లోనే కాకుండా ప్రైవేట్ సెక్టార్ లోకి కూడా విస్తరించాలని అంతేకాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా ఏపీకి సైబర్ సెక్యూరిటీ ఆడిటింగ్ మీద వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ను సెక్యూర్డ్ డిజిటల్ ఫ్యూచర్ గా నిర్మించడానికి యువతను నడిపించే లక్ష్యంగా ఏపీటీఎస్ పనిచేస్తుందని చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలియజేశారు.

## పేదరిక నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి

మొదటిపేజీ తరువాయి

భాగస్వామ్యం (పీ4) కార్యక్రమంపై నిర్వహించిన గ్రామసభ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ 2047 నాటికి విజన్ స్వర్ణాంధ్ర సాధన కోసం నిర్దేశించిన పది లక్ష్యాల్లో భాగంగా పేదరికం నిర్మూలనకు సమాజంలోని ఉన్నత స్థాయిలోని వ్యక్తులు మార్గదర్శులుగా, అట్టడుగున ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దటానికి అవసరమైన సహాయం అందించే కార్యక్రమే పీ4 అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని ఉగాది రోజున అమరావతిలో ప్రారంభించారని, అదే రోజు మేఘా కంపెనీ కృష్ణ జిల్లాలోని వారి స్వంత గ్రామాన్ని దత్తత తీసుకోవటం జరిగిందన్నారు. అదే విధంగా తాడికొండ పొన్నూరులో జరిగిన కార్యక్రమంలోను పై డేటా సోల్యూషన్స్, స్పిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, ఐఎంఏ వైద్యులు దాదాపు 200 కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మార్చి నుంచి ఇంటింటికి సర్వే నిర్వహించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సహాయం అవసరమైన బంగారు కుటుంబాలను గుర్తించటం జరిగిందన్నారు, నారా కోడూరు గ్రామంలో ఇప్పటి వరకు 217 బంగారు కుటుంబాలను గుర్తించటం జరిగిందన్నారు. బంగారు కుటుంబాల జాబితాను గ్రామసభలో ప్రదర్శించటం జరిగిందని, దీనిలో అర్హత ఉన్నవారిని చేర్చులకు, అనర్హుల తొలగింపులపై గ్రామసభలో చర్చించి అభిప్రాయాలు తెలియచేయాలన్నారు. గ్రామసభలో ఆమోదించిన బంగారు కుటుంబాల తుదిజాబితాను ఆన్లైన్ నమోదు చేయటం జరుగుతుందని, దీని వలన సహాయం అందించాల్సిన మార్గదర్శులు దత్తత తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. బంగారు కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలపైనా నీడ్ అసెస్మెంట్ సర్వే జరుగుతుందని, వీటి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయటం జరుగుతుందన్నారు, బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శులు వారి అవకాశం మేరకు దీర్ఘకాలికి, స్వల్పకాలికంగా ఆర్థికంగా, ఆర్థికేతరంగా సహాయం అందించవచ్చన్నారు. బంగారు కుటుంబాల్లో పిల్లలకు విద్య, ఉన్నత ఉద్యోగాల సాధనపై అవగాహన కల్పించటం, వారి ఆర్థికాభివృద్ధికి సలహాలు అందించవచ్చన్నారు. సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, కార్పోరేట్ కంపెనీల నిర్వహకులు , ఇతర ఆర్థిక స్తోమత కలిగిన వ్యక్తులు తమ పరిసర ప్రాంతాల్లోని బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వ అధికారులతో పాటు, స్థానిక పెద్దలు సహకారం అందించి పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్నవారు సమాజం పట్ల బాధ్యతతో మార్గదర్శులుగా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఆర్థికాభివృద్ధి కి సహాయం అందించటమే పీ4 కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శులు ఆర్థికంగా సహాయం అందించటమే కాకుండా వారికి మెంటర్ గాను వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. మార్గదర్శులు వారు ఉన్న రంగాల్లో విజయం సాధించటానికి అవసరమైన మేళకువలను బంగారు కుటుంబాల్లోని పిల్లలకు తెలియచేసి వారిని ప్రోత్సహించవచ్చన్నారు.

## ఈ పాపం..ఎవరిది..?

మొదటిపేజీ తరువాయి

జన్మనిచ్చిన ఆ తల్లికి.. కడుపు తీపి గుర్తుకు రాలేదేమో..! ముద్దు లొలికే ఆ పాపాయిని వదిలి వెళ్లేందుకు. ఆ చిట్టి ప్రాణాన్ని భూమ్మీదకు తీసుకు వచ్చేందుకు పడ్డ పురిటి నొప్పులు మరిచి పోయిందేమో..! పేగు బంధాన్ని వదిలి పెట్టేసింది ఆ తల్లి. కష్టమే వచ్చిందో, భారమని భావించిందో..! ఆడపిల్ల అని వదిలించుకున్నారో తెలియదు కానీ... నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలోని చెత్తకుప్పలో గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన ఆడ శిశువును వదిలి వెళ్లారు. అటుగా వెళుతున్న వారు శిశువును గమనించి మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన శిశువును అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. కాగా అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెత్త కుప్పలో పడవేసిన వారిని గుర్తించి చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు.

# వేళాంగిణి రాజు మోసాలు ఎన్నెన్నో..!

- క్యాటరింగ్ పేరుతో వివాహిత మహిళకు రూ. 3లక్షల టోకరా
- ఎయిమ్స్ ఆసుపత్రి ఉద్యోగాల పేరుతో మరో ఆరుగురి బాధితుల వద్ద నుంచి రూ. 7.56 లక్షల వసూళ్లు
- మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఉద్యోగాల పేరుతో పలువురి నిరుద్యోగుల వద్ద నుంచి కోట్లాది రూపాయలు దండుకున్న అంబటి వేళాంగిణి రాజు మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉద్యోగావకాశాల పేరుతో గత కొన్నేళ్లుగా మోసాలకు పాల్పడుతున్న మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంకు చెందిన అంబటి వేళాంగిణి రాజును ఇటీవల మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించిన విషయం విదితమే. తాజాగా వేళాంగిణి రాజు మోసాలపై మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. సేకరించిన వివరాల మేరకు... నగరంలోని ద్వారకానగర్ కు చెందిన కె. విజయలక్ష్మి, గోపి దంపతులు క్యాటరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పక్క ఇంట్లో ఉండే బి. సీతమ్మ అనే మహిళ మీకు పెద్ద క్యాటరింగ్ కావాలంటే యర్రబాలెం కు చెందిన అంబటి వేళాంగిణి రాజు ను సంప్రదించాలని, అతను తనకు కూడా తెలుసునని చెప్పింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి ఐదవ తేదీన వేళాంగిణి రాజు నగరంలోని ద్వారకానగర్ లోని సీతమ్మ ఇంటి వద్దకు రాగా విజయలక్ష్మి కి పరిచయం చేసింది. పెద్ద క్యాటరింగ్ కావాలంటే తనకు రూ. 3 లక్షలు ఇవ్వాలని వేళాంగిణి రాజు నమ్మబలకడంతో అదే రోజు విజయలక్ష్మి రూ. 3లక్షల నగదును ఇచ్చింది. పది రోజుల తర్వాత వేళాంగిణి రాజు విజయలక్ష్మి కి ఫోన్ చేసి మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పగా తన తమ్ముడు సతీష్ కుమార్ ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడని తెలిపింది. దీంతో వేళాంగిణి రాజు ఎయిమ్స్ ఆసుపత్రిలో మరో ఆరు ఉద్యోగాలు కూడా ఉన్నాయని నమ్మబలికాడు. నిజమేనని నమ్మిన సతీష్ కుమార్ తన ఉద్యోగం కోసం రూ. 95వేలను వేళాంగిణిరాజుకు ఫోన్ పే చేశారు. మరలా వారం రోజుల తర్వాత మరో రూ. 2 లక్షల నగదును చెల్లించాడు. అదే ప్రాంతానికి చెందిన హేమ అనే మహిళ రూ. 1.10లక్షలు, అనురాధ అనే మహిళ రూ. 1.01లక్ష, సావిత్రి అనే మహిళ రూ. 85వేలు, వెంకటరమణ రూ. 65వేలు, పద్మ అనే మహిళ రూ. లక్ష చొప్పున వేళాంగిణిరాజుకు ఫోన్ పే, నగదు రూపంలో చెల్లించారు. నెలలు గడిచినా ఉద్యోగాలు ఇప్పించకుండా కాలయాపన చేస్తున్నాడు. అనుమానం వచ్చిన బాధితులు వేళాంగి రాజును నిలదీయడంతో అసభ్యంగా మాట్లాడటంతో పాటు తమపై బెదిరింపులకు సైతం పాల్పడినట్లు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఎనిమిదో వార్డు డాక్టర్ ఆంజనేయ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు.. 2025 26 వార్షిక బడ్జెట్లో బీసీ సంక్షేమం కోసం 47,456 కోట్లు కేటాయించడం జరిగిందని నామినేటెడ్ పోస్టుల్లో కూడా 34 శాతం రిజర్వేషన్, చట్టసభల్లో 33% రిజర్వేషన్ అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి వాసా పద్మావతి, పట్టణ కార్యదర్శి షేక్ రియాజ్, ఎనిమిదో వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష,కార్యదర్శులు అలుగురి రాజశేఖర్, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వంగర లక్ష్మయ్య, గోవాడ దుర్గారావు, పట్టణ నాయకులు తిరుమలశెట్టి హనుమంతరావు, ఆకురాతి నాగేంద్రం, గోలి బాబురావు, బందారు సీతారామయ్య, అక్కల హరిబాబు, గొర్తి వెంకటయ్య, కాటాబత్తుల లలిత, గుత్తికొండ విజయ కుమారి, మాధవి, ఆకురాతి కవిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వైఖరి విజయాన్ని తెస్తుంది



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** స్థానిక అమరావతి రోడ్డు నందు గల హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు అనుసరించవలసిన వైఖరి వారికి విజయాన్ని తెచ్చి పెడుతుంది అనే అంశం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. నాగభూషణం తెలిపారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేసిన ప్రముఖ ఔషధ సంస్థ ఏమిర్క్ ఏరియా మేనేజర్, కెరీర్ మెంటార్ గోవిందరాజుల నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థుల వైఖరి పునాది వంటిదని, అదే నాయకత్వ లక్షణాలకు, విజయానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు ఇంగ్లీష్ భాష పై పట్టు, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ లో ప్రదర్శించవలసిన స్కిల్స్, భావ వ్యక్తీకరణ, గ్రూప్ డిస్కషన్ లో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ జూపూడి రంగరాజు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్. ఎస్. మధుసూదన రావు తమ కళాశాలను ఎంపిక చేసుకొని మాట్లాడినందుకు నారాయణ ప్రసాద్ అభినందనలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. ప్రత్యూష, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. విజయభాస్కర్ ఫార్మ్. డి. డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, మొదటి సంవత్సరం బి. ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను సూచించిన స్థలాల్లో వేయాలి



**పెదనందిపాడు : మేజర్ న్యూస్ :**

ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి వాటిని ప్రభుత్వం చూపించిన ప్రదేశాలలో, గ్రామానికి దూరం ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్డుల్లో వేయాలని ఎంపీడీఓ లక్షిదేవి అన్నారు. గురువారం ఉదయం మండల పరిధిలోని వరగాని గ్రామంలో ఫీటల్ స్లెడ్జి యూనిట్ ఏర్పాటు కు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగు వర్థ్యల నుండి ఎరువు ను తయారు చేసే యూనిట్ ను ఏర్పాటు చేయనున్నట్లు, ఆ యూనిట్ కోసం స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి నాగయ్య మరియు సిబ్బంది ఉన్నారు.

## సత్తెనపల్లి పట్టణం 3వ వార్డు నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ



**సత్తనపల్లి మేజర్ న్యూస్ :** అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని సత్తనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదహారు లక్షల నలభై వేల రూపాయలతో ఆధునికీకరణ చేసిన వాకింగ్ ట్రాక్ ను ప్రారంభించారు. 3వార్డునందు 12.3 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించబోతున్న సిసి రోడ్లు అంతర్గత డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలతో నేరుగా చర్చించి పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పథకాలు అందుతున్నాయా లేదా అనే దాని పై అధికారులు దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ప్రజలకు స్వయంగా వివరించరు. ప్రతి ఇంటిలో సమస్యలు తెలుసుకొని,వాటిని మై టిడిపి యాప్‌లో స్వయంగా నమోదు చేసిన , వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో మరింత నిధులు తీసుకువచ్చి సత్తెనపల్లి అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యంగా పని చేస్తామన్నరు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి అందరికీ ఇస్తామని చెప్పి మోసం చేసి ఒకరికే పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం లో సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం, దీపం పథకం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ యువతకు ఉద్యోగాల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంద, రానున్న రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలోనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండలకూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ప్రభుత్వం తీసుకురావాలి



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవాదుల పై వృత్తి రీత్యా రోజు రోజుకూ పెరుగుతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, వ్యక్తిత్వ హననం, హత్యలు, హత్యా ప్రయత్నాలు పెరుగుతుండడం పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కారం చేయడంలో ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల న్యాయవాదులలో నిరువుకప్పిన నిప్పులా అసంతృప్తి రగులుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరుకున్న పాత కోర్టుల స్థానంలో నూతన కోర్టు భవనాలు నిర్మించాలని, సత్తెనపల్లి నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ అనుమతులు, నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని, సత్తెనపల్లి నూతన కోర్టు కాంప్లెక్స్ ప్రాంగణంలోనే సత్తెనపల్లి బార్ అసోసియేషన్ లో మెంబర్ అయిన ప్రతి న్యాయవాదికి అడ్వకేట్ చాంబర్ మంజూరు చేయాలని, సత్తెనపల్లి పట్టణంలో కోర్టు కాంప్లెక్స్ పరిసరాల్లో అడ్వకేట్ కాలనీ ఏర్పాటు చేసి న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, అడ్వకేట్ డెత్ బెనిఫిట్స్ 10 లక్షలకు పెంపు చేయాలని, జూనియర్ అడ్వకేట్ లకు నెలకు 10,000/–రూ స్టైపెండ్ ఇవ్వాలని, మహిళా న్యాయవాదులకు ప్రతి కోర్టులో వెయిటింగ్ రూం లు ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా హైకోర్టు నుండి దిగువ కోర్టుల వరకు ఉన్న జడ్జిల, కోర్టు సిబ్బంది పోష్టు లను తక్షణమే భర్తీ చేయాలని తదితర డిమాండ్ ల సాధనకై ఎ.పి.న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐఏఎల్ ప్రతినిథుల బృందం ముఖ్యమంత్రి, న్యాయశాఖ మంత్రి, హోం శాఖ మంత్రి, డి.జి.పి లకు అందుచేయ నున్నట్లు నరిశేటి వేణుగోపాల్ తెలిపారు.

## పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

**దాచేపల్లి మేజర్ న్యూస్ :**

గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని కేసానుపల్లి గ్రామాన్ని పల్నాడు జిల్లా పీడి లింగమూర్తి గురువారం తనిఖీ చేయడం జరిగింది. డ్రైనేజ్ కాలువలను పరిశీలించి ఎక్కడ మురికి నీరు ఆగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనిచేయాలని అధికారులకు హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యం వస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ యువ నాయకుడు నెల్లూరి రామకోటయ్య , సర్పంచ్ చెట్టిపోగు ఏసు దానం , పంచాయతీ కార్య దర్శి స్వామి నాయక్ , బొల్లా కిట్టారావు , నెల్లూరి కోటయ్య, కోటా సాయన్న, షేక్ జానయ్య, నెల్లూరి హనుమంతరావు అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా హరిహర వీరమల్లు రిలీజ్ వేడుకలు




**గుంటూరు మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం పెదపలకలూరు జేఎల్ ఈ సినిమా థియేటర్స్ వద్ద గురువారం ఘనంగా హరిహర వీరమల్లు రిలీజ్ వేడుకలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రిలీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 40 డివిజన్ పెదపలకలూరు జనసేన పార్టీ కార్యాల యం నుండి జే ఎల్ ఈ థియేటర్స్ వరకు డీజే సౌండ్ సిస్టంతో బైక్ ర్యాలీ నిర్వహించి బాణా సంచా కాలుస్తూ, అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం మరియు పవన్ కళ్యాణ్ చిత్రపటా నికి పాలాభిషేకం చేయడం జరిగింది. వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు ,జనసేన పార్టీ నాయకులు , వీర మహిళలు, మెగా అభిమానులు, ఆశేష ప్రజానీకం చిత్రం ఘన విజయం సాధించాలని ర్యాలీలో పాల్గొని జయ జయ ద్వానాల మధ్య పవన్ కళ్యాణ్ వర్ధిల్లాలి... అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అలానే ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు నాగినేని సునీల్ కుమార్ ను మనస్ఫూర్తిగా అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి దేగల లక్ష్మణ్, గుంటూరు నగర్ ఉపాధ్యక్షులు రేణుక రాజు, 40 డివిజన్ అధ్యక్షులు విన్నకోట మల్లికార్జున రావు, ఉపాధ్యక్షులు అడపాల శివ నాగేశ్వరరావు, కే కృష్ణశాస్త్రి ,కార్యదర్శులు కోటి శ్రీనివాస్, జమ్మిశెట్టి నాగరాజు, ముత్యం శ్రీనివాస్ , కటారి గిరి, షేక్ సిలార్ , పల్లె ప్రవీణ్, ఇర్ఫాన్ వెంకటేశ్వరరావు, గురునాథ్, రిషి, అభి, గోపి, నారాయణ, సత్యనారాయణ, సాయి, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చీఫ్ విప్ ప్రజాదర్బార్

**వినుకొండ మేజర్ న్యూస్ :** నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై శుక్రవారం చీఫ్ విప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్‌కు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్నవారు నేరుగా చీఫ్ విప్ జీవీని కలసి సమస్యలు వివరించవచ్చని ఆయన కార్యాలయం ప్రతినిధులు సూచించారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని 5మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్ కు తరలివచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు చీఫ్ విప్ జీవి స్వయంగా స్వీకరించి సాధ్యమైనంత మేరకు తక్షణమే పరిష్కారాలు చూపిస్తారని పేర్కొన్నారు. మిగిలిన వాటికి వినతుల ద్వారా వచ్చే సమస్యలు ఇక్కడి నుంచే విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.



## పేద విద్యార్థినికి రూ.25 వేలు చేయూత



**సత్తెనపల్లి మేజర్ న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థినికి పై చదువుల కోసం పెద్ద మనసుతో ఆర్థిక సహాయం అందించిన తేళ్ళ వెంకటేశ్వరరావు అభినందనీయులని ప్రముఖ యోగా గురువు రమేష్ అన్నారు. సత్తెనపల్లి రూరల్ మండలం, వెన్నాదేవి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసుకున్న పేద విద్యార్థిని కొసనా దేవి శ్రీ సాహితి 565 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. దేవిశ్రీ సాహితి తండ్రి వెంకటేశ్వరరావు కొన్ని సంవత్సరాల క్రితం ఒక ప్రమాదంలో మరణించగా, తల్లి లక్ష్మీసాయి తన ఇద్దరు ఆడపిల్లలను రెక్కల కష్టంతో సంరక్షించుకుంటూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ ఉంది. ఉన్నత చదువులకు అవసరమైన ఆర్థిక పరిపుష్టి లేనందున బాగా చదివే పిల్లలను కూడా చదువు మాన్పించే పరిస్థితి వచ్చింది. స్థానిక పెద్దలు మాదంశెట్టి వేదాద్రి ద్వారా పరిస్థితిని తెలుసుకున్న సత్తెనపల్లి పట్టణానికి చెందిన తేళ్ల వెంకటేశ్వరరావు గురువారం ప్రముఖ యోగా గురువు రమేష్ ద్వారా ఆ అమ్మాయికి రూ. 25000 లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆ అమ్మాయి తన మార్కుల శాతాన్ని తగ్గకుండా తన చదువు కొనసాగించినట్లయితే రానున్న కాలంలో కూడా తగిన ఆర్థిక సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

## రేషన్ షాపులను తనిఖీ చేయండి

**– జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్**




**నరసరావు పేట మేజర్ న్యూస్ :** జిల్లా జాయింట్ కలెక్టర్ పల్నాడు వారు జిల్లాలోని పౌర సరఫరాల డిప్యూటీ తహసిల్దార్లు మరియు ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్‌లతో "రేషన్ కార్డుదారుల ఐవిఆర్ఎస్ కాల్స్ నందు రేషన్ పంపిణీ పై వ్యతిరేకత వ్యక్తం చేసియున్న మరియు దీపం-2 లబ్దిదారుల నుండి డెలివరి బాయ్స్ రసీదు లో ఉన్నరేటు కంటే ఎక్కువగా వసూలు చేయుట మరియు వారితో దురుసుగా ప్రవర్తించుట గురించి డా., బి. ఆర్. అంబేద్కర్ (పి జి ఆర్ ఎస్ ) హాలు నందు సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశము నందు జిల్లా జాయింట్ కలెక్టర్ వారు మాట్లాడుతూ జిల్లాలో రేషన్ పంపిణీ విషయమై కార్డుదారులకు రేషన్ పంపిణీ సరిగా చేయడం లేదని, డీలర్లు కార్డుదారులతో దురుసుగా సమాధానం చెబుతున్నారని ఐ వి ఆర్ ఎస్ ద్వారా ఫిర్యాదులు అందియున్నవని, వాటిని పునరావృతం రాకుండా డిప్యూటీ తహసిల్దార్లు ప్రతి రేషన్ షాపును తనిఖీ చేసి సంబంధిత కార్డుదారులను విచారించి తగు చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించియున్నారు. ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్ లను కూడా వారి గ్యాస్ డెలివరి బాయ్స్ ను అదనపు డబ్బు వసూలు చేయకుండా తగు ఆదేశములు చేయాలని లేని యెడల వారిపై కఠిన చర్యలు తీసుకొనవలెనని ఆదేశించియున్నారు. లేనియెడల వారి బి-ఫారం లైసెన్స్ రద్దు చేయబడునని హెచ్చరించియున్నారు. ఈ సమావేశము నందు శ్రీయుత జిల్లా పౌర సరఫరాల అధికారి పల్నాడు వారు పాల్గొనియున్నారు.

## దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు

**– టాప్–20 జ్యుయలరీ సంస్థల యూనిట్లు స్థాపించేలా చర్యలు**
**– ప్రతిఏటా 4వేలమందికి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ**
**– అధికారులతో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సమీక్ష**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** దేశంలో అత్యుత్తమ మోడల్ లో మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు ఏర్పాటు పై అధికారులతో గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరిలో ఏర్పాటు చేయబోతున్న జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కుతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ఆభరణాల తయారీలో ప్రపంచస్థాయి శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో టాప్ 20 ఆభరణాల తయారీసంస్థలు మంగళగిరి పార్కులో తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉడిపిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యుయలరీ (ఐఐజిజె) పనితీరును అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. దీనిపై స్కిల్ డెవలప్ మెంట్ సిఇఓ గణేష్ కుమార్ స్పందిస్తూ త్వరలో ఏర్పాటుచేసే కామన్ ఫెసిలిటీ సెంటర్ మరియు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ప్రతిఏటా 4వేలమందికి అధునాతన ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పార్కులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఇ), కామన్ ఫెసిలిటీ సెంటర్ (సిఎఫ్ సి), ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ & రిటైల్ జోన్, మ్యానుఫాక్చరింగ్ జోన్, రెసిడెన్షియల్ జోన్, ఇన్ ఫ్రా జోన్ అంతర్భాగాలు ఉంటాయని తెలిపారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరిలో యువతకు నైపుణ్యశిక్షణ అందించే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసిసి)ను కూడా త్వరితగతిన ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ఎంసిసి ద్వారా కెరీర్ కోచింగ్, జాబ్ మ్యాచింగ్, స్కిల్ అప్ గ్రేడేషన్, ఎంప్లాయర్ ఎంగేజ్ మెంట్ చేపట్టాలని అన్నారు. మంగళగిరిలో ఇప్పటివరకు చేపట్టిన 3 జాబ్ ఫెయిర్లకు 1170మంది యువకులు హాజరుకాగా, 453మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు తెలిపారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ... ఇకపై ప్రతినెలా జాబ్ ఫెయిర్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, యువతకు నూరుశాతం ఉద్యాగాలు కల్పించే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సిఇఓ గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కె. రఘు, అసోసియేట్ డైరక్టర్ పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి బోనాల వార్షికోత్సవం




**మంగళగిరి, మేజర్ న్యూస్ :** దేవాంగ చేనేత కులదేవత శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని అమరావతి దేవాంగుల సంక్షేమ సంఘం, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భక్తి, శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని కొప్పు రావు కాలనీ ఐదవ లైను లో ఆ సంఘం కోశాధికారి అల్లక నమశ్శివాయ ఇంటి వద్ద నుండి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా ఈ పూజా కార్యక్రమంలో మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బల్ల వెంకటరమణ అల్లక తాతారావు,అల్లక నమశ్శివాయ,ప్రత్యేక అతిథులుగా దేవాంగ అమరావతి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మాడిశెట్టి శివ శంకరరావు,ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, నక్కిన చిన్న వెంకట్ రాయుడు, పృధ్వి రవి, ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ చేనేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పద్మశాలియ వెల్ఫేర్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ నందం అబద్దయ్య, జనసేన నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, టిడిపి సీనియర్ నాయకులు గుత్తికొండ ధనుంజయరావు,జనసేన సీనియర్ నాయకులు మునగపాటి మారుతీ రావు, గంజి చిరంజీవి, చిట్టెం అవినాష్, దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు బోనాలతో గ్రామ ఉత్సవంలో పాల్గొన్నారు .కోలాట నృత్య ప్రదర్శన, విచిత్ర వేషధారణలతో, సన్నాయి మేళాలు, కనకతప్పెట్లు, తీన్మార్, వాద్య బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు బాణాసంచా కాల్పులతో..ఘనంగా జరిగింది. ఈ గ్రామోత్సవం కుప్పురావు కాలనీలో మొదలై రాజీవ్ సెంటర్ నుంచి మిద్దె సెంటర్ కు మెయిన్ బజార్ గాలిగోపురం మీదుగా పానకాల స్వామి ఘాట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి వారి గుడి ముందు నుంచి గండాలయ పేట లోని శ్రీశ్రీశ్రీ తోతాద్రి పోలేరమ్మ వారి ఆలయానికి బోనాల ఉత్సవం చేరుకుంది. అనంతరం ఆలయంలో శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు జన్మదినోత్సవ కుంకుమ పూజలు కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## ఏంఆర్పి రెట్లకే మద్యం విక్రయించాలి



**పెదనందిపాడు: మేజర్ న్యూస్ :**

మద్యం షాపుల్లో ఏంఆర్పి రెట్లకే మద్యం విక్రాయించలని పొన్నూరు ఎక్సయిజ్ పొన్నూరు సీఐ ఎం రమేష్ అన్నారు. గురువారం మధ్యాహ్నం పెదనందిపాడు మండల పరిధిలోని పలు మద్యం షాపులను అయన తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ డెకయ్ ఆపరేషన్‌లో భాగంగా షాపులను తనిఖీ చేస్తున్నట్లు అయన తెలిపారు. షాప్‌ల్లో స్టాక్ సరిగా ఉంచుకోవాలని, లూజు మద్యం అమ్మరాదని, సీలు వేసిన ప్రభుత్వం సరఫరా చేసే మద్యం బాటిల్స్ ను మాత్రమే అమ్మాలని అయన సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం విధించిన నిబంధనలు మేరకే మద్యం విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే అట్టి షాప్ లపై చర్యలు తీసుకొనున్నట్లు అయన తెలియజేసారు. అయన వెంట ఎస్ఐ శివరాంప్రసాద్, మరియు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రజాకవి గుర్రం జాషువాకు ఘన నివాళులు





**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ప్రజా కవి, కలియుగ నవ వైతాళికుడు గుర్రం జాషువ 54వ వర్ధంతిని పురస్కరించుకొని సత్తెనపల్లి స్టేషన్ రోడ్ లో వున్న జాషువా సాహితీ సేవ సంస్థ, సత్తెనపల్లి వారు ప్రతిష్ఠించిన ఆయన విగ్రహంకు పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి నియోజక వర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ, సాహిత్య అభిమానులైన పట్టణ ప్రముఖులు-యెల్లినేడి రామ స్వామి, దరువూరి నాగేశ్వర రావు, దివ్వెల శ్రీనివాసరావులు జాషువా సాహిత్యాన్ని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది బత్తిన శ్రీనివాస బాబు మాట్లాడుతూ..అణగారిన వ్యవస్థ అభ్యుదయానికి నాంది పలికి, మనువాద విష సంస్కృతికి వ్యతిరేకంగా సాహిత్య విప్లవ శంఖాన్ని పూరించిన మానవతావాది జాషువా గార'ని నేటి సమాజానికి గుర్తు చేశారు. ఈ కార్యక్రమములో సంస్థ కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షులు డా. ఏయన్ఆర్ జక్కం, కార్యదర్శి న్యాయవాది గుజ్జర్లపూడి సురేష్ బాబు, కోశాధికారి కలపాల ప్రేమ కుమార్, సభ్యులు గుజ్జర్లపూడి జాన్ బాబు, న్యాయవాది గుజ్జర్లపూడి జయకుమార్, టిడిపి నాయకులు కూచిపూడి కోటేశ్వర రావు, పి. ఆనంద్ భరత్, కవి కొరబండి అంథోని, విలియం కేరి సంస్థ అధ్యక్షుడు బంకా బాబు రావు, గుర్రం అనిల్, కూచిపూడి కృపారావు, అమర్ పాల్గొన్నారు.

# పద్మవిభూషణ్ గుర్రం జాషువాకు ఘన నివాళులర్పించిన వైసిపి సమన్వయకర్త డాక్టర్ గజ్జల





**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** గుర్రం జాషువా గారి వర్ధంతిని పురస్కరించుకొని సత్తెనపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి జాషువా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి రైల్వే స్టేషన్ రోడ్డులోని వావిలాల పార్క్‌వద్ద ఉన్న జాషువా గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ సంఘసంస్కర్త కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి విశ్వ కవి సామ్రాట్ గా ప్రసిద్ధి చెందిన గుర్రం జాషువా గారిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన ఎన్నో సంస్కరణ పుస్తకాలు రాశారని జాషువా గారు శాసనమండలి సభ్యులుగా కూడా పనిచేశారని ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించారని ఆయన సేవలకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువులను అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**- ఏవో ఎం.సంధ్యారాణి**



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :**

మండలంలోని గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఎరువులు మరియు పి ఎ సి ఎస్ గోదాములను మండల వ్యవసాయ అధికారి ఎం. సంధ్యా రాణి తనిఖీ లు నిర్వహించారు. కావున ఎరువులు కావలసిన రైతులు సొసైటీల లో కానీ పట్టణంలో ని ప్రైవేటు ఎరువుల దుకాణాల నుండి ఎరువులను పొందొచ్చని అన్నారు. వ్యాపారులు ఎవరైనా ఎరువులను కృత్రిమ కొరత సృష్టించిన లేక అధిక ధరలకు అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. మండలంలోని అందుబాటులో ఎరువుల నిల్వలు యూరియా 520 టన్నులు, డి ఏ పి 310 టన్నులు, కాంప్లెక్స్ 730 టన్నులు, పోటాష్ 107, (ఎస్ ఎస్ పి) 67 టన్నులు, మొత్తం 1734 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉంచారు. నానో యూరియా మరియు నానో డి ఏ పి ని రైతులు అన్ని పంటలపై ఉపయోగించవచ్చు పంట పెరుగుదల నాన్యమైన అధిక దిగుబడులకు సహాయపడుతుంది మరియు నెల, నీరు మరియు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుంది. న్యానో యూరియా ని నీటిలో కరిగే ఎరువులు, సాగరిక మరియు కొన్ని రకాల పురుగు మందులతో కలిపి వాడుకోవచ్చు మరియు నాణ్యమైన అధిక దిగుబడులకు సహాయపడుతుంది. అర లీటరు డి.ఎ.పి మరియు యూరియా ఎకరా మోతాదు సరిపో తుందని తెలియజేసారు.

# నియోజకవర్గంలో రోడ్లను గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దటమే లక్ష్యం

**-నగర కమిషనర్ అలీం భాషా**



**మంగళగిరి,మేజర్ న్యూస్ :**

మంగళగిరి -తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చుటకు గాను గౌరవ ఐటి, విధ్యాశాఖా మంత్రి నారా లోకేష్ చే ప్రత్యేక వాహనము ప్రారంభించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని అన్నీ రోడ్లపై ఏర్పడిన గుంతలను రానున్న వంది రోజుల్లో మరమ్మతులకు గురి అయిన అన్ని రోడ్లను ప్రత్యేక ప్రణాళిక ప్రకారంపూర్తి చేయుట జరుగునని నగర పాలక సంస్థ కమిషనర్ అలీం బాష తెలిపారు.ప్రతి రోజు నగరం లో నిర్వహించు క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా నగరంలో పలు ప్రాంతాల్లో గుంతలు మరింత ఎక్కువగా ఏర్పడుట గమనించిన నేపద్యం లో వాటి పరిష్కార చర్యల నిమిత్తం వర్షాల ఆటంకం కలిగినప్పటికిని రానున్న వంద రోజుల్లో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ను గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దటమే లక్ష్యం గా ప్రత్యేక కార్యచరణ ద్వారా అన్ని గుంతలను పూడ్చివేసి మరమత్తులు నిర్వహిస్తామని, ఈ విషయమై నగర ప్రజలు సహకరించవలసినది గా ఆయన తెలిపారు.

కావున నగరంలో మీ ప్రాంతాల్లో గుంతలు మరియు ఏవైనా పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం కొరకు నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ (7093912653, 08645-295192) నెంబర్లకు సమాచారం తెలిపిన యెడల తగు పరిష్కార చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న గజ్జల



**రాజుపాలెం మేజర్ న్యూస్ :** మండలంలో బాబు షూరిటీ-మోసం గ్యారంటీ రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో.... చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు చేస్తూ నిర్వహించిన కార్యక్రమంలో సత్తనపల్లి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అని ప్రతి ఇంటికి బాండ్లు పంపిణీ చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు షూరిటీ కాస్త మోసం గ్యారంటీగా మారిపోయిందని, ప్రజలను చంద్రబాబు తరచూ మభ్యపెడుతున్నారని,మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి సంవత్సరం దాటిపోయిన పట్టించుకున్న ఊసే లేదని,నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ప్రతినెలా ఇస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను గాలికి వదిలేసి పబ్బం గడుపుతున్నారని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 చొప్పున ఇస్తానని చెప్పి ఏడాది గడిచిన మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా చంద్రబాబు చోద్యం చూస్తున్నారని,ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని తెలియజేస్తూ, చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదని కార్యకర్తలకు నేను అండగా ఉంటానని భరోసా ఇస్తూ,ప్రతి ఒక్క వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాజుపాలెం మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి చంద్రబాబు నాయుడు వలన జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొంతు రెడ్డి సునీత శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా వైసిపి సెక్రెటరీ భాషా,పార్లమెంట్ సోషల్ మీడియా సభ్యులు జానీ, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సీతారాములు, వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నగరంలో డిస్ప్లే బోర్డు నిర్వాహకులు ఈనెల 31 లోగా బకాయిలు చెల్లించాలి



**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ నిర్వహకులు ఈ నెల 31వ తేదీలోపు డిస్ప్లే ఫీజు బకాయిలు మొత్తం చెల్లించాలని, చెల్లించని వారి బోర్డ్ లను ఆగస్ట్ 1వ తేదీ నుండి తొలగిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ నిర్వహకులతో ఫీజుల బకాయిలపై ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఏజన్సీల వారీగా డిమాండ్, బకాయిల వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ ప్రకటనల బోర్డ్స్ ఏజన్సీల నిర్వహకులు ప్రస్తుత ఆర్ధిక సంవత్సరంతోపాటు గతంలోని బకాయిలు మొత్తం ఈ నెలాఖరులోపు చెల్లించాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ఫీజులు చెల్లించిన, చెల్లించని వారి వివరాలతో ఈ నెల 31 సాయంత్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించామన్నారు. నివేదిక మేరకు బకాయిలు చెల్లించని బోర్డ్‌లను సమూలంగా తొలగిస్తామన్నారు. అలాగే సదరు బకాయిల వసూళ్లకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో ఆగస్ట్ 1 నుండి అనధికార లేదా బకాయిలు ఉన్న సంస్థల ప్రకటనల బోర్డ్ లు, హోర్డింగ్స్ ఉండడానికి వీలు లేదని, పట్టణ ప్రణాళిక అధికారులు మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి రెహ్మాన్, మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ నిర్వహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# గుర్రం జాషువాకు టిడిపి నాయకులు ఘన నివాళులు

**వినుకొండ మేజర్ న్యూస్ :** నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ టిడిపి నాయకులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల గుర్రం జాషువా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికై అక్షర సమరాన్ని సాగించిన గుర్రం జాషువా స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కోరారు. జాషువా రచనలతో సమాజాన్ని జాగృతం చేసిన తీరును వివరించారు. సమాజ శ్రేయస్సు జాషువా చేసిన కృషిని జ్ఞాప్తికి తెచ్చుకొని జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణా కార్యక్రమం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ తెనాలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండల పరిధిలోని రైతు సేవ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి మూడు రోజులు పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ శిక్షణ కార్యక్రమంలో పర్యావరణానికి హాని కలిగించే రసాయన ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా, ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించి ,సుస్థిర అభివృద్ధి సాధించే లక్ష్యాలతో అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏపీసిఎన్ఎఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ,తెనాలి ఏడిఏ కే.రాజకుమారి , వ్యవసాయ అధికారులు ఆర్ .విజయబాబు, కె .సుధీర్ బాబు, శ్రీనివాసరెడ్డి, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, రైతు సేవ కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేడు సత్తెనపల్లి రానున్న రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు పాల్గొనున్నారు. పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల్లో భాగంగా తాలూకా సెంటర్ నందు గల ఉప ఖజానా కార్యాలయం, మెయిన్ రోడ్ నందు గల ఆర్ అండ్ బి అతిథి గృహాన్నీ మంత్రి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమన్ని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కన్నా కార్యాలయం పిలుపునిచ్చింది.

# సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం

**– ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని**

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :**

కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గురజాల శాసనసభ్యులు యరపతినేని పాల్గొన్నారు. పట్టణంలోని, "6వ వార్డు, మరియు 7వ వార్డు ల" నందు ఈ సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు వార్డులలో ఇంటింటికి వెల్లి, సంవత్సరకాలంలో కూటమి ప్రభుత్వం గురజాల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని మరియు సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఉన్నం నాగమల్లికార్జున రావు , పిడుగురాళ్ల యార్డు చైర్మన్ తురక వీరస్వామి పిడుగురాళ్ల పట్టణ పార్టీ అధ్యక్షులు పాండురంగ శ్రీనివాస రావు వార్డు ఇన్చార్జీలు మరియు పిడుగురాళ్ల మండలం, టౌన్ లోని వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, యువత, పట్టణంలోని 6వ మరియు 7వ వార్డులలోని నాయకులు ,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ ఆదేశాల మేరకు పి-4 విధానాన్ని సమర్ధ వంతంగా అమలు జరపాలి

**– జిల్లా కలెక్టర్ : పి. అరుణ్ బాబు**




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా నరసరావు పేట ప్రభుత్వ ఆదేశాల మేరకు పి 4 కు సంబంధించి నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో 15, 17 వార్డులలో వార్డు సభను నిర్వహించడం జరిగింది. సభలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, విశిష్ట అతిథిగా చదలవాడ అరవింద్ బాబు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు డా. చదలవాడ అరవిదబాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, ఆర్. డి. ఓ. మధులత, కమీషనర్ యశ్వంతరావు పి. 4 యొక్క విధివిధానాలు సచివాలయ సిబ్బంది నమోదు వివరాలు, ఇంకా ఎవరైనా ఉంటే నమోదు చేసుకోవచ్చని తెలిపారు.
పి. 4 అంటే నరసరావు పేట నియోజక వర్గంలో 63 వేలు నమోదు చేసు కున్నారని వారిలో ఒక్క నరసరావు పేటలోనే సుమారు 4000 మంది ఉన్నారని మార్గదర్శకు లుగా కేవలం 100 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు తెలిపారు పల్నాడు జిల్లాలో ఎందరో డబ్బులు ఉన్నవారు డాక్టర్లు వ్యాపారులు, ఉద్యోగులు ఆర్థికంగా స్థిరపడిన వారు, విదేశాలలో ఉంటున్న వారు ఉంటున్నారని ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేస్తున్న చదలవాడ అ-రవింద్ బాబు కూడా ఒక డాక్టర్ ఏనని, పి. 4 అంటే లేని వ్యక్తికి ఆర్థిక సాయం రైతులకు సాయం పిల్లల కు సాయం ఉద్యోగ సాయం ఇలా ఏదైనా సాయం చేయవచ్చు అని కనీసం మాట సాయమైనా చేయవచ్చునని గుర్తు పెట్టు కోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు సచివాలయ సిబ్బంది మరియు వార్డ్ సభ్యులు ఇతర ఇన్చార్జి లు పాల్గొనడం జరిగింది.

# గుండె పోటుతో సీనియర్ జర్నలిస్ట్ మృతి



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పట్టణానికి చెందిన 6 టీవీ రిపోర్టర్ సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కొత్తపల్లి రమేష్ గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. దాదాపు 30 ఏళ్లుగా పత్రిక రంగంలో విశేష సేవ లను అందరికీ సుపరిచితుడైన రమేష్ మరణం బాధాకరమైన విషయం అని పిడుగురాళ్ల వర్కింగ్ జర్నలిస్ట్ సంతాపం వ్యక్తం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు పాల్గొని రమేష్ బౌద్ధకాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగడ సంతాపం తెలియజేశారు.

# పేదరిక నిర్మూలనకు వ్యాపార సంస్థలు ముందుకు రావాలి

**– గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు**
**– వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులతో సమావేశం**

**గుంటూరు, మేజర్ న్యూస్ :**

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలన్నదే పీ-4 కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని దీని కోసం వ్యాపారవేత్తలు, వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులు ముందుకు రావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి తన క్యాంపు కార్యాలయంలో నగరంలో ఉన్న బిల్డర్స్, ఇంజినీర్స్, కళాశాల యజమానులు, పలు రంగాల వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ...

ఆంధ్రప్రదేశ్ లో ఉన్న పేదల జీవన ప్రమాణాలు పెంచాలనే సదుద్దేశ్యం దేశంలో ఎక్కడ లేని విధముగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ%-%4 అనే కార్యక్రమం చేపట్టారని, దీనికి సమాజంలో ఉన్న ధనవంతులు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు తో పాటు ప్రజలు భాగస్వాములై పేదరిక నిర్మూలన కోసం పనిచేయాల్సి ఉంటుందని, సంపదలో ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 10% మంది... అట్టడుగున ఉన్న వారిలో 20% మంది పేదలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపొచ్చని ప్రభుత్వం భావిస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో 20వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, ఈ కుటుంబాలను మార్గదర్శులుగా ఆదుకోవటానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరినట్లు, పలు కుటుంబాలకు మార్గదర్శులుగా మారటానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, యాగంటి దుర్గారావు, గుమ్మడి హరిబాబు, అంకారావు, నాగ వంశీ, డి. యస్. ఆర్, మాస్టర్ మైండ్స్ మోహన్, సరిపూడి అనిల్, పెరుమాళ్ళు మలినేని ఇంజనీరింగ్ కాలేజీ ప్రతినిధులు, బంగారూ బాబు, బొమ్మిడాల రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంగళగిరి - తాడేపల్లి

# నగరపాలక సంస్థకు దేశస్థాయిలో 328 వ ర్యాంక్

**– రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంక్**



**మంగళగిరి,మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛభారత్ అమల్లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ - 2025 భారత ప్రభుత్వం వారిచే నిర్వహించుట జరిగినది. ఇందులో భాగంగా 2016 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం పారిశుద్ధ్య పురోగతి దృష్ట్యా,సర్వే, టెస్ట్ ప్రాక్టీస్, సిటీజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకులను,అవార్డులను దేశవ్యాప్తంగా ఇవ్వడం జరుగుతుంది. ఇందులో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 కు గాను మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ లో గత ఏప్రిల్,మే నెలలో జరిగిన సర్వే ను అనుసరించి 4900 పై చిలుకు నగరాల్లో మంగళగిరి కి దేశస్థాయిలో 326వ స్థానం అలాగే రాష్ట్రస్థాయిలో 11వ స్థానాన్ని పొందడం జరిగింది. గౌరవ ఐటి విద్యా శాఖామాత్యులు ,స్థానిక శాసన సభ్యులు నారా లోకేష్ సూచనల మేరకు స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమాన్ని నిర్వహించి పట్టణ పారిశుధ్య పరిస్థితులను గణనీయంగా మెరుగుపరిచి గత సంవత్సరం జాతీయ స్థాయి లో 1591 నుండి 326వ ర్యాంకుకు, రాష్ట్రస్థాయి లో 96 వ ర్యాంకునుండి 11వ స్థానమును ప్రజల భాగస్వామ్యంతో పొరుగున గల విజయవాడ,గుంటూరు నగర పాలక సంస్థలను అధిగమించి ఈ ర్యాంకులను సాదించుట గర్వకారణమని కమీషనర్ తెలిపారు. అదేవిధంగా ఓడిఎఫ్ ప్లస్, గార్బేజి ఫ్రీ సిటీల విభాగములలో వన్ స్టార్ సర్టిఫికెట్ను కూడా మంగళగిరి సాధించడం జరిగినది. స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిన సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్, సర్టిఫికేషన్, సిటిజన్ వాయిస్ కి సంబంధించి మంగళగిరి 7354 మార్కులు, తాడేపల్లి 5389 మార్కులు సాదించుట జరిగినది. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాష మాట్లాడుతూ... గౌరవ ఐటి, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు,సిబ్బంది సమన్వయంతో పై తెలిపిన ర్యాంకులు సాధించామని మును ముందు కూడా నగరపాలక ప్రజలు మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరించి తద్వారా రానున్న కాలంలో నగరపాలక సంస్థ స్థాయిని మరింత మెరుగుపరచుటకు సహకరించాలని కోరారు. నగర ప్రజల సహకారంతోనే ఈ ర్యాంక్ సాధ్యమైనదని, కేవలం ర్యాంకు కోసమే కాకుండా ప్రజలకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన జీవనం అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. స్వచ్ఛమంగళగిరిని విజయవంతంగా నిర్వహించే మేజర్ డ్ర యిన్ క్లీనింగ్ 100% డోర్ టు డోర్ కలెక్షన్ , గార్బేజ్ డంపింగ్ పాయింట్ల నిర్మూలన ఖాళీ స్థలాలను ప్రత్యేక ప్రణాళిక ద్వారా శుభ్రపరచుట స్వచ్ఛ అంబాసిడర్ల ను నియమించుట ద్వారా సాధ్యమైనట్లు తెలిపారు.

# ప్రధాన్ మంత్రి జనజాతీయ వికాస్ మిషన్ అమలులో ఏపీ ఉత్తమం

- **లోక్ సభలో తెదేపా పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడి**
- **రూ.709.60 లక్షల నిధులతో 115 హాట్ బజార్ల ఏర్పాటు**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** నరసరావుపేట ఎంపీ, లోక్‌సభలో తెలుగు దేశం పార్టీ (టీడీపీ) ఫ్లోర్ లీడర్ లావు శ్రీ కృష్ణదేవరాయలు పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాన్ మంత్రి జనజాతీయ వికాస్ మిషన్ (పీఎంజీవీఎం) అమలుపై లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్రాలవారీగా మిషన్ అమలుపై గురువారం సమగ్ర సమాచారం సమర్పించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మిషన్ అమలులో ఉత్తమంగా ప్రదర్శన చేసిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిచిందని వెల్లడించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.709.50 లక్షల నిధులతో పాటు, 115 హాట్ బజార్లు, ఒక నిల్వ సదుపాయం (స్టోరేజ్ ఫెసిలిటీ), ఒక అదనపు మౌలిక వసతి మంజూరు చేయడం జరిగిందని వెల్లడించింది. ఈ చర్యల ద్వారా గిరిజన మార్కెట్లను బలోపేతం చేసి, విలువ చైన్‌లకు చేరువయ్యే అవకాశాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామని సంబంధిందిత మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2023-25 కాలంలో రాష్ట్రంలో 8 గిరిజన కళాకారుల మేళాలు నిర్వహించారని, ఇవి గిరిజన ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడం, జీవనోపాధిని మెరుగుపరచడం,కళాకారుల మార్కెట్ లభ్యతను పెంచడంలో ముఖ్య పాత్ర పోషించాయని తెలియజేసారు. జాతీయ స్థాయిలో చూస్తే, ఇప్పటివరకు 1,372 ఆధునిక హాట్లు, 639 నిల్వ సదుపాయాలు మరియు 22 అదనపు మౌలిక వసతుల ప్రాజెక్టులు మంజూరయ్యాయని వెల్లడించింది. ట్రైఫెడ్ తన ప్రచార కార్యక్రమాలను బలపరచడంతో పాటు 2023%-%24లో 61 కళాకారుల మేళాలు, 20 ప్రదర్శనలు నిర్వహించగా, 2023%-%25లో ఇప్పటివరకు 18 మేళాలు మరియు 30 ప్రదర్శనలు నిర్వహించడం జరిగిందని రిపోర్టులో వెల్లడించింది. ఈ సందర్భంగా లావు శ్రీ కృష్ణదేవరాయలు గారు మంత్రిత్వ శాఖ మరియు ట్రైఫెడ్‌ను అభినందిస్తూ, నిధుల సమయోచిత వినియోగం, సమర్థవంతమైన పర్యవేక్షణ మరియు గిరిజన సముదాయాల సాంఘిక - ఆర్థిక అభివృద్ధికి నిరంతర సహకారం అవసరమని హితవు పలికారు.

# జోరువానలోనూ ఉత్సాహంగా సాగిన సుపరిపాలన

**అడుగడుగునా ప్రజాశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 50వ డివిజన్ లో గురువారం జోరువానలోనూ సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి తమ ఇంటి ముంగిటకు వచ్చిన ఎమ్మెల్యే నసీర్ కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి తమ పరిపాలన ఏడాది ప్రోగ్రెస్ గురించి ఎమ్మెల్యే నసీర్ అడిగి తెలుసుకున్నారు. ఏడాది ప్రోగ్రెస్ సూపర్ సక్సెస్ గా ఉందని ప్రజలు కితాబిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పింఛన్లు నాలుగు వేల రూపాయలు పెంచి ప్రతి నెలా ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్నందుకు అవ్వతాతలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి వందల కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచబోతున్నామని తెలిపారు. దీని కోసం ప్రతి ఒక్కరూ మార్గదర్శకులను గుర్తించాలని పిలుపునిచ్చారు. ఏడాది పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, అన్ని రంగాల్లో పురోగతి సాధించామని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించామని తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇదే సమయంలో రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నామని, అంతర్గత రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మారుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని, క్లస్టర్ ఇంచార్జ్ మహంకాళి నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, కో క్లస్టర్ ఇంచార్జ్ వంగర ఏడుకొండలు, డివిజన్ అధ్యక్షులు బాజీ, గిరి, రమణ, కేసాని ప్రసాద్, సుభాని, దేశ బోయిన శ్రీనివాస్ యాదవ్, రావూరి మోహన్ కృష్ణ, కోట గోపాల్, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గుడిమెట్ల దయారత్నం, రాచకొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు2005పై అవగాహన సదస్సు

**నరసరావుపేట, మేజర్ న్యూస్** నరసరావుపేట జిల్లా సహకార బ్యాంక్ మీటింగ్ హాల్ లో సమాచార హక్కు 2005 పై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు..సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి సహకార శాఖ ఉద్యోగులకు, బ్యాంకు సిబ్బందికి, ప్రాథమిక సహకార సంఘాల సీఈఓ లందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారం, సహాయం పొందుతున్న అన్ని సంస్థలకు అన్ని శాఖ కార్యాలయాలకు సమాచార హక్కు చట్టం వర్తిస్తుందని చెప్పారు అందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న 1964 ఏపీ సి ఎస్ చట్టం కింద రిజిస్టర్ చేయబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార దళపతి సంఘాలు ఆర్ టి ఐ పరిధిలోకి వస్తాయన్నారు. సమాచార హక్కు చట్టం2005 లో మొత్తం 31 సెక్షన్స్ ఉన్నాయని, ఆరు చాప్టర్ లు ఉన్నాయని సెక్షన్ 2 ప్రాముఖ్యత గురించి వివరించారు. డివిజనల్ సహకార అధికారి కె. తిరుపతయ్య మాట్లాడుతూ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి ,సమాచార కమిషనర్ అధికార పరిధి, విధి విధానాలు చట్టం వివరిస్తున్నటువంటి సమాచార విషయాలు వాటి గురించి వివరించారు. సమాచార హక్కు ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని చెప్పారు. దీనిపై అధికారులు, పౌరులు పరస్పరము బాధ్యతాయుతముగా పారదర్శకంగా వ్యవహరిస్తూ చట్టాన్ని దుర్వినియోగం కాకుండా ప్రజా అవసరాలకు ఉపయోగించుకోవాలని కె .తిరుపతయ్య అన్నారు . విజయవాడ కో-ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ రంగరాజు మాట్లాడుతూ ప్రజలకు సమాజానికి ఉపయోగపడే అనేక అవసరాలను సాధించవచ్చని, తన అనుభవంలో ఎదుర్కొన్న కొన్ని సమస్యలు వాటి పరిష్కారాలను సమాచార హక్కు చట్టం ద్వారా నెరవేరిన విషయాలను వివరించారు. ఎస్ డి ఎల్ సి ఓ రామిరెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం లో ఉన్నటువంటి ప్రజా బాహుల్యాం లోకి రాని విషయాలను, సెక్షన్ 8 యొక్క ప్రాధాన్యతను, వివరించారు.డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీస్ సూపర్డెంట్ జె. పి. డి. టాండన్




మాట్లాడుతూ సమాచార హక్కు కింద అడిగిన విషయాలను సంబంధిత పత్రాలకు అయ్యే ఖర్చును అర్జీదారుడు పెట్టుకోవాలని సదరు అర్జీదారుడు ఆ మొత్తాన్ని చెల్లించనీ యెడల సదరు ఖర్చు కార్యాలయాలకు ఆర్థిక భాగం అవుతుందని తన అనుభవంలో వేల పేజీల కొద్దీ సమాచారం అడిగి తదుపరి అర్జీ దారులు తీసుకోకుండా వెళ్లిపోయారని తెలిపారు .కావున సమాచార హక్కు అర్జీదారులు బాధ్యతాయుతంగా పారదర్శకంగా అడిగే విషయాన్ని స్పష్టత తోటి, ప్రజా అవసరం తోటే అడగాలని విన్నవించారు. జిల్లా సహకార కార్యాలయ సూపర్డెంట్ కార్తీక్ సమాచార హక్కు విషయంపై సహకార రంగంలో వస్తున్నటువంటి ఫిర్యాదులపై వివరించారు.ఈ కార్యక్రమంలో జిడిసిసిబి నరసరావుపేట బ్రాంచ్ సిబ్బంది, సహకార శాఖ పల్నాడు జిల్లా కార్యాలయ సిబ్బంది, డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయ ,సబ్ డివిజనల్ కార్యాలయం నరసరావుపేట సిబ్బంది నరసరావుపేట తాలూకాలోని 18 పిఏసిఎస్ ల సీఈఓ లు , తదితరులు పాల్గొన్నారు.

# నగర శివార్లలో అవుట్ పాల్ డ్రైన్లు శుభ్రం చేయాలి

**గుంటూరు నగర కమిషనర్ ఆదేశం**




**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్:** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అంతర్గత డ్రైన్ లు మేజర్ డ్రైన్లలో కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్ ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల, రెడ్డిపాలెం, సరస్వతి నగర్, జయంతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్ల వారీగా తమ పరిధిలో డ్రైన్ల శుభ్రంపై దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య కార్మికులు తప్పనిసరిగా మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రైన్ల శుభ్రం చేయాలని ఆదేశించారు. అలాగే వార్డ్ ల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి, స్థలాలు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. స్పందించని వారి స్థలాల్లో జిఎంసి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. అలాగే ప్రజల నుండి అందే ఫిర్యాదులను ప్రాధాన్యతగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారంకు కార్యదర్శులు భాధ్యతగా ఉండాలన్నారు. పర్యటనలో ఎస్ఎస్ ఐజాక్, టిపిఎస్ లక్ష్మణస్వామి, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

**జిల్లా వ్యవసాయ అధికారి ఏ. నాగేశ్వరావు పిలుపు**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు జిల్లా లోని వ్యవసాయ శాఖ , ఉద్యాన శాఖలకు చెందిన 209 గ్రామ వ్యవసాయ అధికారులు గ్రామ ఉద్యాన అధికారులకు గురువారం ప్రకృతి వ్యవసాయ విధానాలపై శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు, డివిజన్ పరిధిలో వున్న గుంటూరు కృషి భవన్, మంగళగిరి ,దుగ్గిరాల ,, పొన్నూరు, ఫిరంగిపురం కార్యాలయాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ. మూడు రోజుల పాటు ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, , జూమ్ మీటింగ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన 9 సార్వత్రిక సూత్రాలను వివరించారు., ఎ గ్రేడ్, ఏటీఎం, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ మోడల్స్ యొక్క పద్ధతులను ,రైతులు పొందిన ప్రయోజనాలను తెలిపారు ప్రభుత్వ,రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆదేశాల మేరకు జిల్లాలో.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎ. నాగేశ్వరావు తెలిపారు వ్యవసాయ శాఖ,, ఉద్యాన శాఖలు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సహకరించాలన్నారు., అన్ని రంగాలు కూడా ఒకే బాటలో పని చేయాలి, ముఖ్యంగా అది ప్రకృతి వ్యవసాయమై ఉండాలి అని తెలియజేశారు. రైతులందరికీ రసాయనాలు వాడకం తగ్గించి సహజ జీవన ఉత్ప్రేరకాలు ఉపయోగిస్తే భూమికి కలిగే ప్రయోజనాలు గురించి తెలపాలన్నారు.. అందరూ ఈ పద్ధతులు పాటించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తదుపరి జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి. రవీంద్ర బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతులు పాటించడం ద్వారా భూమి ఆరోగ్యం కాకుండా మన అందరి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అందువల్ల రైతులు రసాయనాల వాడకం తగ్గించే విధంగా మనం కలిసి విధులను నిర్వహించాలి అని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ కుమారి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ రైతులు సాధించిన ఫలితాలు తెలిపారు, ఇంకా ఇప్పటి దాకా 80 గ్రామ పంచాయతీలు మాత్రమే ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఉన్నాయి, ఇప్పుడు నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ ప్రోగ్రామ్ ద్వారా 233 గ్రామ పంచాయతీలు ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు అందువల్ల అందరం కలిసి రైతులను ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గుంటూరు. ఏడిఏ. మోహన్ రావు , జిల్లా యాంకర్ గోపి చంద్, ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వివరించారు. అదే విధంగా జిల్లాలోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారులు, మండల వ్యవసాయ మరియు ఉద్యానశాఖ అధికారులు అందరం కలిసి రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలి అని కోరారు. జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన, డి ఆర్ సి , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.